# మల్లన్న ఆలయ హుండీ లెక్కింపు



2 లో




# మనం

## మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

శుక్రవారం | 13 | అక్టోబర్ | 2023 | పేజీలు : 8





# జెండాలు మోయాల్సిందేనా?

## లీడర్లు ఒకే...

## మరి క్యాడర్ మాటేంటి..?

## మారుతున్న లీడర్ల బతుకులు

## కార్యకర్తలకు మంచి రోజులెప్పుడు

సిద్దిపేట, అక్టోబర్ 12, మనం న్యూస్ ప్రతినిధిః పార్టీకి కార్యకర్తలే వెన్నుముక.... క్యాడర్ లేనిదే లీడర్ లేడు. మేమిక్కడ ఉన్నామంటే అదంతా కార్యకర్తలు భుజాన జెండాలు కాయలు కాసేలా మోసిన ఫలితమే... సందర్భమేదైనా బడా లీడర్ల నోటి నుండి వచ్చే మాటలు. మరీ ముఖ్యంగా ఎన్నికలొచ్చాయంటే చాలు.. కార్యకర్తలను కడుపులో పెట్టుకుంటాం... తమ కుటుంబ సభ్యుల్లా భావిస్తాం... అని బాతా ఊదడం మరింత పెరుగుతుంది. కానీ నిజానికి చూస్తే భుజాలు కాయలు కాసేలా జెండాలు మోసిన కార్యకర్తలు ఎలా ఉన్నారు.. కార్యకర్తల కష్టం మీద లీడర్ల బతుకులు ఎలా ఉన్నాయని ఒక్కసారి ఆలోచిస్తే లీడర్లంతా ఖద్దర్ బట్టలు, ఏసి కార్లు... మరి క్యాడర్ పరిస్థితి...? దశాబ్ధాలు మారుతున్నా అవే బతుకులు...! ఎన్నికలప్పుడు తమకు అవకాశం రాలేదు...ఫలానా పార్టీలో విలువ లేదు... కార్యకర్తల నిర్ణయమే శిరోధార్యమంటూ మైకుల ముందు పెద్ద పెద్ద మాటలు మాట్లాడే లీడర్లంతా రాత్రికి రాత్రే కండువాలు మార్చుతూ అటు పదవులు, ఇటు డబ్బులు సంపాదిస్తుంటే వారిని చూసి తమ బతుకులు ఇంతే.....! అని రెండు రోజులు ఏడ్చి మరో పది రోజుల్లోగా కొత్త లీడర్లను తయారు చేస్తున్న కార్యకర్తలు మాత్రం అదే జీవితాన్ని గడుపుతూ వస్తున్నారు.

**బతుకులు మారేదెన్నడో...** ప్రస్తుతం పెద్దపెద్ద మిగతా 2లో..

# దేశానికే ఆదర్శంగా రాష్ట్ర ప్రభుత్వ పథకాలు



## రాజకీయ పబ్బం గడుపుకోవడానికే ప్రతిపక్షాల విమర్శలు

### మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, అక్టోబర్ 12, మనం న్యూస్ః రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మెదక్ ఎంపి, దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మిరుదొడ్డి, అక్బర్‌పేట మండలాల్లో ఎంపి ప్రభాకర్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. మిరుదొడ్డి మండలంలోని ధర్మారం గ్రామంలో మహంకాళి, బీరప్ప దేవాలయాలను దర్శించుకున్నారు. అనంతరం అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్, వీరారెడ్డి, మాదన్నపేట గ్రామాల్లో పర్యటించారు మిగతా 2లో..

# ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ

-ఆడపడుచులకు ఇష్టమైన పండుగ

-తొమ్మిది రోజులపాటు ఘనంగా నిర్వహించుకునే సంబురం



7 లో

# జెండాలు మోయాల్సిందేనా?

మొదటి పేజీ తరువాయి..

లీడర్లంతా కార్యకర్తలు కష్టపడితేనే ఈ స్థాయిలో ఉన్నారు... ఆ విషయం వారికీ తెలుసు. లీడర్ కోసం కుటుంబం బాధ్యతలు వదిలి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ లీడర్లు పెద్దయితే తమ బతుకులకు దారి దొరుకుతుందని 24 గంటలు శ్రమించిన కార్యకర్తలను పట్టించుకునే నాయకులెంతమంది అని చూస్తే వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ఎన్నికలప్పుడు ఏదో ప్రేమ ఉన్నట్టు నటిస్తూ నేనున్నా తమ్ముడు అంటూ భుజంపై చేయి వేసి జేబులో నాలుగు కరెన్సీ కాగితాలు పెట్టగానే దానికే మురిసిపోయి తనను మించిన దార్కార్ లేడంటూ మళ్లీ ప్రచార రథం ముందు జెండాలు పట్టి, అవసరమైతే ఎదుటి పార్టీ నాయకుడితో గొడవలు పెట్టుకునే కార్యకర్త బతుకులు ఎన్నికలు అయిపోయాక మళ్లీ యథాస్థితికే చేరుకుంటున్నాయి. దశాబ్దాల కాలంగా ఈ పార్టీ, ఆ పార్టీ అనే తేడా లేదు. కేవలం రాజకీయమే తమ జీవిత లక్ష్యంగా కరుడుగట్టిన కార్యకర్తల్లా పని చేస్తున్న వారి కుటుంబంలోని పిల్లలను కనీసం చదివించుకోలేని దుస్థితి. ఆ కార్యకర్తల తల్లిదండ్రులకు రోగమొస్తే అన్నీ అమ్ముకొని చికిత్స చేయించుకోవాల్సిందే. అన్నీ అయిపోయాక లీడర్ వచ్చి అనుకోకుండా వేరే పనిలో ఉన్నా.... నేనున్నా... అధైర్య పడకు అంటూ జేబులో రూ. 5 వేలు పెట్టగానే మళ్లీ అదే పంథా... అదే తీరు.

## మారుతున్న లీడర్ల బతుకులు

క్యాడర్ల చేతిలో పైకెదిగి నియోజకవర్గంలోని పెద్ద నాయకుల వెంట చోటామోటా లీడర్లుగా ఉన్నోళ్లంతా అదును చూసి కాటేసేటోళ్లన్న విషయం సందర్భం వస్తేగానీ బోధ పడడం లేదు. తాము ఆశించిన స్థాయిలో పదవి దక్కకపోయినా సదరు ఎమ్మెల్యేనో, ఎంపినో, మంత్రి దగ్గరో పరపతి తగ్గినట్టు అనిపించినా క్షణం కూడా ఆలోచించకుండా చొక్కా మార్చినంత ఈజీగా కండువా మార్చడం లీడర్లకు అలవాటైపోయింది. ప్రస్తుతం చూస్తుంటే గతంలో ఎమ్మెల్యే పదవులు అనుభవించిన వారు, ఎమ్మెల్సీలుగా కొనసాగిన వారు, కార్పోరేషన్ ఛైర్మన్‌లు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పార్టీలు మారుతున్నారని మాత్రమే చూస్తున్నాము తప్పితే క్యాడర్ మారుతున్న సందర్భం ఎక్కడా కనిపించదు. కార్యకర్తల రెక్కల కష్టం మీద తామీస్థాయిలో ఉన్నామన్న సోయి కూడా లేకుండా రాత్రికి రాత్రే కండువాలు మార్చుతున్న తీరును చూసి ఊసరవెల్లిలు కూడా సిగ్గుపడుతున్నాయి.

–జెర సోచో....

ఇప్పటికైనా వచ్చిన నష్టమేమీ లేదు. ముందుంది అసలు యుద్ధం. కార్యకర్త కష్టానికి గుర్తింపునిచ్చేదెవరో... కడుపులో పెట్టుకొని చూసుకునేదెవరో ఒక్కసారి ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలదే. ఈ ఎన్నికల సమయంలో నాలుగు రోజులకు నాలుగు రూపాయలకు ఆశపడ్డారో ఐదేళ్లు మీ బతుకులు మళ్లీ యథాస్థితే. కార్యకర్తా... బీ కేర్‌ఫుల్. లీడర్ ఫ్యూచర్ డిసైడ్ చేసేది నువ్వే... ప్రలోభాలకు లొంగకు.. ప్రజాస్వామ్యాన్ని బతికించే నిన్ను అనుక్షణం నడిపించే నాయకున్ని ఎన్నుకో.


## బిఆర్ఎస్సోళ్లవి అబద్ధపు మాటలు

### సొంత పార్టీ వారికే కండువాలు కప్పి బీజేపి నుండి చేరుతున్నారంటూ ప్రచారం



చిన్నకోడూరు, అక్టోబర్ 12, మనం న్యూస్ః బీజేపి పార్టీ కార్యకర్తలు పార్టీలు మారేవారు కాదని, సిద్ధాంతం కోసం పని చేసే వారని పార్టీ మండల అధ్యక్షులు పిట్ల పర్శరాములు అన్నారు. బిఆర్ఎస్సోళ్లు అబద్ధపు ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని, వచ్చే ఎన్నికల్లో గులాబీల మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిల్లో లేరన్నారు. బుధవారంనాడు విఠలాపూర్ బీజేపి ఉప సర్పంచ్ బిఆర్ఎస్‌లో చేరాడంటూ అసత్య ప్రచారం చేస్తూ ఆనందం పొందారన్నారు. అసలు గ్రామ ఉప సర్పంచ్ బీజేపి పార్టీ కార్యకర్త కాదని, బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన కార్యకర్త అన్నారు. అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ అయిన బిఆర్ఎస్‌లో ఎవరు చేరడం లేదని, వారి పార్టీ కార్యకర్తలకే కండువాలు వేస్తూ బీజేపి నుండి చేరుతున్నారంటూ రాక్షసానందం పొందుతున్నారన్నారు. చిన్నకోడూరు మండలంలో బిఆర్ఎస్‌పై తీవ్ర వ్యతిరేకత ఉందని, కారు పార్టీ ఓటమికి చిన్నకోడూరు మండలం నుండే పునాది పడనుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐటి, సోషల్ మీడియా కన్వీనర్ ముచ్చర్ల నాగరాజు ఉన్నారు.

## మృతుని కుటుంబానికి బిఆర్ఎస్ నాయకుల ఆర్థిక సాయం



మిరుదొడ్డి, అక్టోబర్ 12, మనం న్యూస్ః అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన నగరం నాగభూషణం దహన సంస్కారాల నిమిత్తం ఉప సర్పంచ్ గుర్క పర్శరాములు రూ.5 వేలు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఈదరి కనకయ్య రూ. 2 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగభూషణం మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అందేలా చొరవ తీసుకుంటామన్నారు. ఆయన వెంట మాజీ ఉప సర్పంచ్ పోతారం రాజు, పద్మశాలి సంఘం అధ్యక్షులు మురళి, పాలకవర్గ సభ్యులు వెంకట్, రాజయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, బోయిని రాములు, యువకులు బైరవచారి, భానుచందర్, అరవింద్ తదితరులున్నారు.

## జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైన మిరుదొడ్డి విద్యార్థులు




మిరుదొడ్డి, అక్టోబర్ 12, మనం న్యూస్ః మిరుదొడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐదుగురు విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక కావడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. ఎంపికైన వారిలో శృతి 982/1000, అనిత 956/1000, వంశీకృష్ణ 951/1000, దీపిక 943/1000, మహేష్ 940/1000 మార్కులు సాధించి కేంద్ర విద్యాశాఖ ప్రతి ఏటా అందించే జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలకు ఎంపిక కావడం జరిగిందన్నారు. ఎంపికైన వారికి డిగ్రీ స్థాయిలో మూడు సంవత్సరాలు, పిజి స్థాయిలో రెండు సంవత్సరాలు, ప్రతి సంవత్సరం రూ.10 వేలు చెల్లించడం జరుగుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్‌తోపాటు అధ్యాపక బృందం అభినందించారు.



## దేశానికే ఆదర్శంగా రాష్ట్ర ప్రభుత్వ పథకాలు

మొదటి పేజీ తరువాయి..

మాదన్నపేట గ్రామస్తులు బిఆర్ఎస్ పార్టీకే తమ సంపూర్ణ మద్ధతు ఇస్తున్నామని ఏకగ్రీవంగా ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు కేవలం వారి రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసమే ఎన్నికల ముందు ప్రజలకు ఉచిత హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా బీజేపి, కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకొని బిఆర్ఎస్ పార్టీపై విమర్శలు మానుకొని ప్రజలకు సంక్షేమ పథకాలు అందివ్వాలన్నారు. మాదన్నపేట గ్రామస్తుల వలె దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లోని వారంతా ఐకమత్యంగా ఉంటూ తమకు ఓటేసి గెలిపించినట్లయితే ప్రజల సంక్షేమం కోసం తాను ఎల్లవేళలా కష్టపడుతానన్నారు. ఈ కార్యక్రమంలో మిరుదొడ్డి, అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంతోపాటు మండలాల పరిధిలోని ఆయా గ్రామాల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న ఆలయ హుండీ లెక్కింపు



కొమురవెల్లి, అక్టోబర్ 12, మనం న్యూస్ః శ్రీ మల్లికార్జున స్వామి వారి ఆలయ హుండీ లెక్కింపు గురువారం రోజున చేపట్టారు. సిరిసిల్ల జిల్లాకు చెందిన శివరామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు సుమారు వంద మంది పాల్గొని 62 రోజుల హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. 62 రోజులకు గాను రూ. 65 లక్షల 18 వేల 785ల నగదు రాగా మిశ్రమ బంగారం 25 గ్రాములు, వెండి 4500 గ్రాములు రాగా మొక్కబడి రూపంలో భక్తులు సమరిపచిన బియ్యం వేయి కిలోలు, విదేశీ కరెన్సీ నోట్లు 11 వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తుల పాలిట కొంగుబంగారంగా బాసిల్లుతున్న కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి హుండీ ఆదాయంతోపాటు భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుంటున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి బాటలో మల్లన్న దేవాలయ ప్రాంగణం దూసుకెళ్తుందని ఆలయ వర్గాలు చెబుతున్నారు. అందువల్లే హుండీ ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి బాలాజీ, ఏఈఓలు వైరాగ్యం అంజయ్య, కత్తి శ్రీనివాస్, ఆలయ సూపరిండెంట్ నీల శేఖర్, స్థానాచార్యులు పడిగన్నగారి మల్లేశం, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది సార్ల విజయ్‌కుమార్, కనకయ్య, మిన్నలపు నర్సింలు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వంగపల్లి అంజయ్యస్వామి జన్మదిన వేడుకలు

గజ్వేల్, అక్టోబర్ 12, మనం న్యూస్ః ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ధార్మిక పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి అంజయ్య స్వామి జన్మదిన వేడుకలు గురువారం గజ్వేల్‌లో ఘనంగా నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని ఇందిరా పార్కు చౌరస్తా వద్ద గురువారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో సుమారు 300 మందికి అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భఃగా కొండపోచమ్మ ఆలయ డైరెక్టర్ గోలి సంతోష్, సీనియర్ నాయకులు నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ వంగపల్లి అంజయ్య జన్మదినం సందర్భంగా ఐవిఎఫ్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ, అన్నదానం నిర్వహించడం జరిగిందన్నారు. ఇందుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతి మంగళవారం కాచారం ఎల్లమ్మ దేవాలయంలో అన్నదానం చేస్తూ సమాజానికి తనవంతు సేవలు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న వంగపల్లి అంజయ్య నిండునూరేళ్లు ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.



# కొంతమంది చేతిలో బంధీ అయిన తెలంగాణ

-సొంత పార్టీ కార్యకర్తను గుర్తించలేని వ్యక్తి ప్రజలకేం చేస్తాడు

-డిడిలు కట్టినా గొల్లకుర్మలకు అందని యూనిట్లు

-కేంద్ర కేబినెట్‌లో 27 మంది బిసిలతో సముచిత స్థానం

-దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు







దుబ్బాక టౌన్, అక్టోబర్ 12, మనం న్యూస్‌: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ నేడు కొంతమంది చేతిలో బంధీ అయిందని, నేడు నిరుద్యోగ యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. గురువారం రోజున దుబ్బాక మండలం అచ్చు మాయపల్లి, కమ్మరపల్లి, ఆరెపల్లి గ్రామాల్లో బీజేపి పార్టీకి ఓటేయాలంటూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఉప ఎన్నికల్లో దుబ్బాక ప్రజలు పువ్వు గుర్తుపై ఓటేసి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపారని, త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. గెలిచిన మూడేళ్లలోనే దుబ్బాక అభివృద్ధికి కృషి చేశానని, ఇక్కడి నిరుద్యోగ యువతకు వివిధ పోటీ పరీక్షలకు కోచింగ్ కోసం హైదరాబాద్‌కు వెళ్లకుండా దుబ్బాకలోనే కోచింగ్ ఇప్పించానన్నారు. ఎంతో మంది యువకులు డ్రైవింగ్ లైసెన్స్ లేక ఇబ్బందులకు గురయ్యారని, వారికి సొంత ఖర్చులతో లైసెన్స్‌లు కూడా ఇప్పించడం జరిగిందన్నారు. ఇక్కడి యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో జాబ్‌మేళాను నిర్వహించి వేల మందికి జాబులు ఇప్పించానన్నారు. కొంతమంది రఘునందన్‌రావు ఏం చేశాడని మాట్లాడుతున్నారని, దానికి ఇదే నిదర్శనమన్నారు. పదేళ్లుగా దుబ్బాక అభివృద్ధికి ఏం చేయని కొత్త ప్రభాకర్‌రెడ్డి నేడు అసెంబ్లీ అభ్యర్థిగా బిఆర్‌ఎస్ తరుపున బరిలో నిలిచాడని గ్రామాల్లోని ఏ ఊరికి వెళ్లినా కూడా తన సొంత పార్టీ కార్యకర్తను కూడా గుర్తు పట్టడని, అలాంటి వ్యక్తి దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేస్తాడని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వృద్ధులకు రెండు వేల పెన్షన్ ఇస్తున్నా మని గొప్పలు చెప్పుకుంటున్నారని, రూ. 2 వేల పింఛన్ ఇస్తూ గ్రామాల్లో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారన్నారు. పదేళ్లలో తెలంగాణ అభివృద్ధికి ఏమీ చేయని బిఆర్‌ఎస్ సర్కార్ ఎన్నికలు రాగానే అభివృద్ధి అంతా తామే చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ముదిరాజ్‌లకు చేప పిల్లలను, గొల్లకుర్మలకు గొర్రెలను ఇస్తున్నామని చెప్పి వారి కుటుంబం మాత్రం రాజకీయ పదవులతో ఊరేగుతుందన్నారు. బిసిల అభివృద్ధికి కృషి చేసే ఏకైక ప్రభుత్వం కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వమని, కేంద్ర క్యాబినెట్‌లో 27 మంది బిసిలకు మంత్రి పదవులిచ్చి సముచిత స్థానం కల్పించిన పార్టీ బీజేపి పార్టీ అన్నారు. మహిళలకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం 33 శాతం రిజర్వేషన్‌ను అమలు చేసిందన్నారు. మహిళలకు, బిసిలకు అధిక ప్రాధాన్యత ఇచ్చే పార్టీ బీజేపి పార్టీ అన్నారు. గొల్లకుర్మలకు రెండో విడత గొర్రెలు ఇస్తానని డిడిలు కట్టించుకొని ఇంత వరకు యూనిట్లను అందజేయలేదని, దీన్నిబట్టే వారి పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏమిటో తెలుస్తుందన్నారు. రాష్ట్రంలో బీజేపి జెండా ఎగరడం తథ్యమని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపి జెండా ఎగరడం తథ్యమని, ఇక్కడి ప్రజలు మరోమారు కమలం గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ ఎస్ఎన్‌చారి, పార్లమెంట్ కో కన్వీనర్ చింత సంతోష్ గుప్త, మండల పార్టీ అధ్యక్షులు అంబటి శివ ప్రసాద్ గౌడ్, కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి, సర్పంచ్ రెడ్డి దేవిరెడ్డి, బీజేపి నాయకులు కిష్టమ్మగారి సుభాష్‌రెడ్డి, మంద అనిల్‌రెడ్డి, సుంకు ప్రవీణ్, ప్రహ్లాద్‌రావు, మచ్చ శ్రీను, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపితోనే అభివృద్ధి సాధ్యం

### బీజేపి మండల పార్టీ అధ్యక్షులు మన్యం శశిధర్‌రెడ్డి



కొండపాక, అక్టోబర్ 12, మనం న్యూస్‌: భారతీయ జనతా పార్టీతోనే రాష్ట్రం, దేశం అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపి మండల పార్టీ అధ్యక్షులు మన్యం శశిధర్‌రెడ్డి అన్నారు. గురువారం కుకునూరుపల్లి గ్రామంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మండల ప్రధాన కార్యదర్శి పండరి హరీష్‌రావు ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు మన్నెం శశిధర్‌రెడ్డి అధ్యక్షతన కుకునూరుపల్లి గ్రామ బీజేపి నాయకులు, గ్రామ పెద్దలు, యువకులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిఎం విశ్వకర్మ పథకం ద్వారా 18 సాంప్రదాయ కులవృత్తులకు సంబంధించి 5 శాతం వడ్డీతో మొదటి దశలో ఒక లక్ష రూపాయలు, రెండవ దశలో రూ. 2 లక్షలు లోన్ తీసుకునే అవకాశం ఉందన్నారు. నైపుణ్య అభివృద్ధి కోసం చేతివృత్తుల వారికి శిక్షణ సందర్భంగా ప్రతి రోజు రూ. 500 స్టైఫండ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పేద వర్గాల కోసం కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపి పార్టీకి మద్ధతు ఇవ్వాలని, బీజేపిని భారీ మెజార్టీతో గెలిపించుకొని అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో బీజే పి జెండా ఎగిరే విధంగా అందరూ కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దారం గురువారెడ్డి, అసెంబ్లీ విస్తారక్ చేకూరి అనుష్ యాదవ్, ఉమ్మడి మండల ఉపాధ్యక్షులు కూరెళ్ల నాగేందర్‌రెడ్డి, రెడ్డమైన లింగం, కిసాన్‌మోర్చ అధ్యక్షులు గౌరారం కృష్ణ యువమోర్చ అధ్యక్షులు దాసరి స్వామి, బీజేపి నాయకులు మేర బిక్షపతి, కరుణాకర్, రాంరెడ్డి, కుమారస్వామి, ఎలగారి ఆంజనేయులు, రెడ్డమైన నాగరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 13 నుండి 16 వరకు జోనల్ స్పోర్ట్స్ మీట్

### ఆర్‌సిఓ నిర్మల



మిరుదొడ్డి, అక్టోబర్ 12, మనం న్యూస్‌: మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల చెప్యాల చౌరస్తాలో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఈనెల 13 నుండి 16 వరకు జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు ఆర్‌సిఓ నిర్మల తెలిపారు. గురువారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 9వ జోనల్ మీట్‌లో భాగంగా సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలకు చెందిన 12 గురుకుల పాఠశాలల్లోని 1020 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. అండర్ 14, అండర్ 17, అండర్ 19 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ టెన్నికాయిట్, క్యారమ్స్, చెస్ అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ ధనలక్ష్మి, సుజాత, లక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## పట్టు రైతుల సమస్యలు పరిష్కరించాలి

### జాయింట్ డైరెక్టర్‌కు రైతుల వినతి




సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 12, మనం న్యూస్‌: పట్టు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం సిద్దిపేట జిల్లా పట్టు రైతుల సంఘం ఆధ్వర్యంలో రైతులు హైదరాబాద్‌లోని రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ లతకు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా పట్టు రైతులు మాట్లాడుతూ 2018 సంవత్సరం నుండి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్‌లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుమలగిరి, జనగామ మార్కెట్లలో రైతులు అమ్మిన రోజునే డబ్బులు ఇవ్వకుండా సుమారు 15 నుండి నెల రోజుల వరకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, పట్టుగూళ్లు అమ్మిన రోజే రైతులకు మార్కెట్‌లో డబ్బులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టుపురుగులకు వినియోగించే మందులను, పరికరాలను సబ్సిడీపై రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ విషయమై జాయింట్ డైరెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పట్టు రైతుల సంఘం అధ్యక్షులు పెద్దోళ్ల ఐలయ్య, ఉపాధ్యక్షులు యాదగిరి, సహాయ కార్యదర్శి దేవయ్య, కోశాధికారి రాగుల రాజు, కార్యవర్గ సభ్యులు బొగ్గుల నర్సింలు, బి. ఆంజనేయులు, ఎల్. సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి చేయూత



కొండపాక, అక్టోబర్ 12, మనం న్యూస్‌: నిరుపేద కుటుంబానికి చెందిన మహిళ మృతి చెందడంతో మహిళ దహన సంస్కారాల నిమిత్తం పలువురు ముందుకు వచ్చి అండగా నిలిచారు. కుకునూరుపల్లి మండల పరిధిలోని కోనాయిపల్లి గ్రామానికి చెందిన గూడపు సువర్ణ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న డిసిసిబి ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి రూ. 10 వేలు, కోనాయిపల్లి సర్పంచ్ రూ. 5 వేలు, గ్రేటర్ రాష్ట్ర జాగృతి కార్యదర్శి ప్రశాంత్ రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని అందించి వారి కుటుంబానికి బాసటగా నిలిచారు. బాధిత కుటుంబం అధైర్య పడవద్దని, ధైర్యంగా ఉండాలని, అండగా తాము నిలుస్తామని మనోధైర్యం కల్పించారు.

## ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో యోగాసన పోటీలు



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 12, మనం న్యూస్‌: సిద్దిపేట జిల్లా ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా యోగాసన పోటీలు జిల్లా కేంద్రంలోని టిటిసి భవనంలో గురువారం నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుండి దాదాపు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 40 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరికి ప్రత్యేకంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు సిద్దిపేటలో అక్టోబర్ 28, 29, 30వ తేదీలలో నిర్వహించడం జరుగుతుందని, ఎస్‌జిఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పన్యాల రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు తోట సతీష్, వెంకటస్వామి, ఉప్పలయ్య, రాధిక, రజిని తదితరులు పాల్గొన్నారు.



# పార్టీకి కార్యకర్తలే బలం

**-బీజేపిలో చేరిన ఆయా మండలాల యువత**

**-కర్ణాటక సౌత్ బెలుగాం ఎమ్మెల్యే అభయ్‌పాటిల్**

దుబ్బాక, అక్టోబర్ 12, మనం న్యూస్‌: కార్యకర్తలు పార్టీకి బలమని, కార్యకర్తలు తలుచుకుంటే ఏదైనా సాధ్యమవుతుందని కర్ణాటక సౌత్ బెలుగాం ఎమ్మెల్యే అభయ్‌పాటిల్, కర్ణాటక మాజీ ఛైర్మన్ రాజ్‌కుమార్ పాటిల్ గురువారం రోజున ఎమ్మెల్యే రఘునందన్‌రావు నివాసంలో ఆయనతో కలిసి సంపర్క్ అభియాన్ బూత్ కమిటీ అధ్యక్షులతో, ఆయా మండల పార్టీ అధ్యక్షులతో సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికల్లో బీజేపి గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దుబ్బాక నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ





ముందంజలో ఉందని, బీజేపి మెజార్టీ కోసం మరింత కృషి చేయాలన్నారు.

**-ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పలువురి చేరికలు**

దుబ్బాక మండలం పెద్దచీకోడు బిఆర్ఎస్ పార్టీ వార్డు మెంబర్ కొమిరె నరేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమ్మరి నర్సింలు దుబ్బాక బీజేపి మండల పార్టీ అధ్యక్షులు అంబటి శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆరెపల్లి, కమ్మరపల్లి, అచ్చుమాయపల్లి గ్రామాలకు చెందిన సుమారు వంద మంది యువకులు రఘునందన్‌రావు ఆధ్వర్యంలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మంద అనిల్‌రెడ్డి, ప్రహ్లాద్ , మల్లారెడ్డి, విభీషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్‌కు తప్పిన ప్రమాదం



కొండపాక, అక్టోబర్ 12, మనం న్యూస్‌: కుకునూరుపల్లి వద్ద రాజీవ్ రహదారిపై గురువారం పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. అడిషనల్ కలెక్టర్ రామగుండం వైపు వెళ్తుండగా కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న కిష్టాపూర్ క్రాసింగ్ వద్ద ముందు వెళ్తున్న వాహనం సిగ్నల్ ఇవ్వకుండానే రోడ్డుపై యు టర్న్ తీసుకోవడంతో ప్రమాదం చోటు చేసుకుంది. యు టర్న్ చేసుకుంటున్న కారును పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ విజయ శ్యామ్ ప్రసాద్ వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

# దేవాలయ భూమిలో అక్రమ ఇంటి నిర్మాణం

**-నిర్మాణం ఆపివేయాలన్నా కొనసాగిస్తున్న వైనం**

**-అక్రమ నిర్మాణంపై తహసీల్దార్ చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ ఆగ్రహం**

దుబ్బాక, అక్టోబర్ 12, మనం న్యూస్‌: దేవాలయానికి సంబంధించిన భూమిని కొంతమంది కబ్జాదారులు అక్రమంగా కబ్జా చేసుకొని భవన నిర్మాణం చేపట్టడం సరైంది కాదని వేణుగోపాల స్వామి దేవాలయ కమిటీ సభ్యులు అన్నారు. గురువారం రోజున దుబ్బాక తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. దుబ్బాక మండలం హబ్సిపూర్ గ్రామంలో సర్వే నెంబర్ 417, 418లో గల భూమిలో కొంతమంది అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. దేవాలయ భూమిని ఎవరైనా కబ్జా చేస్తే ఊరుకునేది లేదని గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు హెచ్చరించారు. గతంలో రెండుమూడుసార్లు అక్రమంగా నిర్మిస్తున్న వారికి చెప్పినా కూడా పట్టించుకోకుండా తమదే అంటూ నిర్మాణం కొనసాగిస్తున్నారని, ఇప్పటికైనా నిర్మాణం ఆపకపోతే గ్రామస్తులంతా ఏకమై కూల్చివేస్తామని హెచ్చరించారు. దుబ్బాక తహసీల్దార్ ఈ అక్రమ నిర్మాణాన్ని వెంటనే ఆపివేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ



ఎన్నికల తర్వాత సర్వే చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ



కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బాలెంల నర్సారెడ్డి, వార్డు మెంబర్ బాలెంల రాంచంద్రం, ఆలయ కమిటీ అధ్యక్షులు బాలెంల భాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు బొలుగం ప్రవీన్ గౌడ్, యాడవరం రాజు గౌడ్, అస్క తిరుపతి, అస్క నగేష్, అస్క శంకర్, కమ్మరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ సభను అడ్డుకుంటాం

**- పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని బీఆర్ఎస్**

**- ప్రజలను మభ్యపెట్టేందుకే కేసీఆర్ సభ**

**- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర సభ్యుడు గవ్వ వంశీధర్‌రెడ్డి**

హుస్నాబాద్,అక్టోబర్ 12,(మనం న్యూస్): ఈ నెల 15 న హుస్నాబాద్‌లో నిర్వహించే కేసీఆర్ సభను అడ్డుకుంటామని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర సభ్యుడు గవ్వ వంశీధర్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణ కేంద్రంలోని తిరుమల గార్డెన్స్‌లో గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రతి పరీక్ష పేపర్ లీక్ అవ్వడం లేదంటే పరీక్షనే రద్దు అయ్యిందని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ సర్కార్‌లో యువత బతుకులు ఆగమయ్యాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. హుస్నాబాద్ ప్రాంతం పై ఎమ్మెల్యేది సవతి తల్లి ప్రేమ అంటూ ఆయన ఆరోపించారు. కోమటి చెరువును అభివృద్ధి చేసుకున్నారు కానీ ఎల్లమ్మ చెరువును ఎందుకు సుందరీకరణ చేయలేకపోయారంటూ ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇచ్చారంటూ ఆయన ఆరోపించారు. 2007 లో ప్రారంభమైన గౌరవెల్లి ప్రాజెక్టు పనులు నత్తనడకగా నడిచింది నిజం కాదా అన్నారు. ఒక్క ఎకరానికైనా ఇప్పటి వరకు నీళ్లు ఇచ్చారా అంటూ ఆయన ప్రశ్నించారు. గత ఎన్నికల్లో కేసీఆర్ కొత్తకొండ ఆశీర్వాదంతో మీ ముందుకు వస్తున్నాను ఆశీర్వదించండి అని అన్నారు. కానీ గెలిచాక కొత్తకొండ వీరభద్రుడిని దర్శించుకున్నారా ఆలయ అభివృద్ధి చేసారా అంటూ ఆయన ప్రశ్నించారు.




హుస్నాబాద్ నియోజకవర్గంలోని స్వయంభూ రాజేశ్వరస్వామి, హుస్నాబాద్ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి, కొత్తకొండ వీరభద్రుడి ఆలయాలను అభివృద్ధి పరచడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించారని ఆయన మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే సతీశ్‌బాబుని ఇంటికి సాగనంపడం ఖాయమని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా నాయకులు మొలుగూరి హరికృష్ణ, హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు రాగుల శ్రీనివాస్, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు గడిపే సుజిత్, వేముల శ్రావణ్, గుళ్ల సృజన్, మొలుగూరి శ్రీమాన్, బోయిని శ్రీనివాస్, బెజ్జంకి వీరయ్య, చెరవేని ప్రదీప్, విజయ్ తదితరులున్నారు.

## త్వరలోనే గొర్రెల పంపిణీ

### ఎంపి ప్రభాకర్‌రెడ్డి



దౌల్తాబాద్, అక్టోబర్ 12, మనం న్యూస్: ప్రభుత్వం అందిస్తున్న రెండవ విడత సబ్సిడీ గొర్రెల పంపిణీకి సంబంధించిన ప్రక్రియ వేగవంతం చేయాలని గొర్రెల కాపర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోచబోయిన శ్రీహరి యాదవ్ ఎంపిని కోరారు. దౌల్తాబాద్ మండల అధ్యక్షులు బొట్క సత్యం యదవ్, యువజన అధ్యక్షులు గొల్ల రాజశేఖర్ యాదవ్, ఉపాధ్యక్షులు నరేష్ యాదవ్, కార్యదర్శి సత్యం యాదవ్‌లతో కలిసి ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎంపి కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడగా ఆయన సానుకూలంగా స్పందించి కట్టి గొర్రెల డిడిలన్నింటికీ త్వరలోనే ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేకుండా గొర్రెలు పంపిస్తామని తెలిపినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు ఎంపి ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



దౌల్తాబాద్, అక్టోబర్ 12, మనం న్యూస్: దౌల్తాబాద్ మండల పరిధిలోని గాజులపల్లికి చెందిన పడిగె రాజవ్వకు రూ. 40 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బిఆర్ఎస్ నాయకులు పంజా స్వామి, చింతకింది మంజూర్, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌ల సహకారంతో అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేద ప్రజల పక్షపాతిగా ప్రజలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందరెడ్డి, శ్రీను, పంజా కనకయ్య, యాదగిరి, అశోక్, కొత్త రాజు, నారాయణ, పంజా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం




గజ్వేల్, అక్టోబర్ 12, మనం న్యూస్: గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అల్పాహార పంపిణీ కార్యక్రమం గురువారం 104 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా డా. లింగం మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని, ప్రతి రోజు ఉదయం ప్రభుత్వ దవాఖానాలో రోగులకు వారి బంధువులకు అల్పాహారం అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అనంతరం లయన్స్‌క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు నేతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో డా. లింగంను శాలువాతో సన్మానించారు. డా. లింగం ఐఎంఏ గజ్వేల్ అధ్యక్షులుగా విశేష సేవలందిస్తూ రాష్ట్ర సర్జరీ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, అత్తెల్లి లక్ష్మయ్య, కొండపోచమ్మ దేవస్థానం డైరెక్టర్ గోలి సంతోష్, నంగునూరి సత్యనారాయణ, రీజియన్ ఛైర్మన్ గుడాల రాధాకృష్ణ, పరమేశ్వర చారి, విరూపాక్ష, అజయ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి రజక సంఘం ఆర్థిక సాయం

జగదేవ్‌పూర్, అక్టోబర్ 12, మనం న్యూస్: జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తీగుల్ గ్రామంలో అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన రాచకొండ మల్లయ్య కుటుంబ సభ్యులకు గురువారం మండల రజక సంఘం నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మండల రజక సంఘం గౌరవఅధ్యక్షులు అక్కారం నర్సింలు, ఉపాధ్యక్షులు వడ్లకొండ శ్రీనివాస్, రాచమల్ల శ్రీనివాస్, కోశాధికారి రాచకొండ బాల్‌నర్సయ్యతోపాటు పలువురు రజక సంఘం నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత కొంత కాలంగా జగదేవ్‌పూర్ మండలంలో బాధిత రజక కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉండాలనే ఉద్దేశంతో రజక సంఘం తరుపున ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాచమల్ల సత్తయ్య, కిష్టయ్య, మైసయ్య, బాలయ్య, స్వామి, నాగరాజు, రాచకొండ దశరథ, అంజయ్య, విజయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల స్టడీ సర్కిల్‌కు స్థలం కేటాయించాలని వినతి




సంగారెడ్డి, అక్టోబర్ 12, మనం న్యూస్: వికలాంగుల స్వయం ఉపాధి స్టడీ సర్కిల్ కోసం సంగారెడ్డిలో స్థలం కేటాయించాలని కోరుతూ టిఎస్‌హెచ్‌డిసి ఛైర్మన్ చింతా ప్రభాకర్ వికలాంగుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో గురువారం క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. భవనానికి స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అడివయ్య అధ్యక్షులు మాణిక్, జిల్లా అధ్యక్షులు గోపాల్, కార్యదర్శి బస్వరాజ్, వికలాంగులు పాల్గొన్నారు.

## ఆడపిల్లలను అన్నింటా ప్రోత్సహించాలి

### జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ వాసవి



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 12, మనం న్యూస్: ఆడపిల్లలను అన్నింటా ప్రోత్సహించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ వాసవి అన్నారు. గురువారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట అర్బన్ మండలం నాంచార్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు బేటి బచావో బేటీ పడావో ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల చట్టాల గురించి అందరూ తెలుసుకోవాలని, సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనే విధంగా ప్రతి ఆడపిల్ల తయారవ్వాలన్నారు. ఆడపిల్ల పుట్టిందంటే ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంటుందని, ప్రతి ఆడపిల్లను ప్రోత్సహించాలన్నారు. అనంతరం పాఠశాలలో ముందస్తుగా బతుకమ్మ పండుగ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, జెండర్ స్పెషలిస్ట్‌లు లావణ్య పద్మ, ఫైనాన్షియల్ లిటరసీ నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జున్‌రెడ్డి, దేవరాజు, స్రవంతి, సుజాత, అంగన్‌వాడి టీచర్, ఆశా కార్యకర్తతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికైన యువకుడు

### సన్మానించిన రజక సంఘం నాయకులు



జగదేవ్‌పూర్, అక్టోబర్ 12, మనం న్యూస్: పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికైన మండల పరిధిలోని తీగుల్ గ్రామానికి చెందిన ఓ యువకుడిని గురువారం మండల రజక సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్‌గా ఎంపికైన గ్రామానికి చెందిన యువకుడు రాచమల్ల శ్రీశైలంను మండల రజక గౌరవాధ్యక్షులు అక్కారం నర్సింలు, ఉపాధ్యక్షులు వడ్లకొండ శ్రీనివాస్, రాచమల్ల శ్రీనివాస్, కోశాధికారి రాచకొండ బాల్‌నర్సయ్యలు అతడిని అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు రాచమల్ల సత్తయ్య, కిష్టయ్య, మైసయ్య, బాలయ్య, స్వామి, నాగరాజుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# క్యాసారంలో బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

## ఆహ్వానించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, అక్టోబర్ 12, మనం న్యూస్ః పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి బిఆర్ఎస్ పార్టీలోకి స్వాగతించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి సంక్షేమం మరింత ముందుకు వెళ్లాలంటే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టాలని





పిలుపునిచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దామని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి రామచంద్రయ్య, శంకరయ్య, కిష్టయ్య, రాఘవేందర్, యాదయ్య, శ్రీనివాస్, ప్రభు తదితరులు బిఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రభాకర్, ఈశ్వర్, శ్రీనివాస్, రమేష్, ఎం. ప్రభాకర్, నవీన్, మధుసూదన్‌రెడ్డి, శరణప్ప, సత్యనారాయణ, సుధాకర్, భూపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాతృశ్రీ ఆసుపత్రిలో వికటించిన ఆపరేషన్

సంగారెడ్డి, అక్టోబర్ 12, మనం న్యూస్ః సదాశివపేట పట్టణలోని మాతృశ్రీ ఆసుపత్రిలో నిర్వహించిన ఆపరేషన్ వికటించి మహిళ మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొండాపూర్ మండలం మాందాపూర్‌కు చెందిన మహిళ కడుపు నొప్పి సమస్యతో ఆసుపత్రికి వెళ్లింది. కడుపునొప్పి కోసం ఆపరేషన్ చేయగా ఆపరేషన్ వికటించడంతో రక్తస్రావం అధికంగా కావడంతో డాక్టర్లు వెంటనే హైదరాబాద్‌కు తరలించాలని బంధువులకు తెలిపారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి మహిళను తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మల్లమ్మ (41) మృతి చెందింది. సదాశివపేటలోని వైద్యుల నిర్లక్ష్యం వల్లే మల్లమ్మ మృతి చెందిందని ఆసుపత్రి వద్ద మృతురాలి బంధువులు ఆందోళన చేపట్టారు. తమకు తగిన న్యాయం చేస్తామని పోలీసులు వారికి హామీ ఇవ్వడంతో మృతురాలి బంధువులు ఆందోళన విరమించారు.



# గడప గడపకు కాంగ్రెస్ పార్టీ

## ప్రచారంలో ముందుకెళ్తున్న ఎంపిపి రవిందర్ గౌడ్

జిన్నారం, అక్టోబర్ 12, మనం న్యూస్ః జిన్నారం మండలం సోలక్‌పల్లి, ఇమామ్‌నగర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల హామీల కరపత్రాలతో ఇంటింటి ప్రచారం జిన్నారం మండల ఎంపిపి రవిందర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపిపి గంగు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలను స్పష్టంగా అర్థమయ్యేలా ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ గతంలో ప్రభుత్వంలో





ఉన్నప్పుడు ఇచ్చిన మాటను తూచా తప్పకుండా నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని, ఇప్పుడు రాబోయే రోజుల్లో కూడా యావత్ తెలంగాణలో అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వందశాతం నెరవేరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి గంగు రమేష్, ఊట్ల గ్రామ ఉప సర్పంచ్ జింకల రవిందర్, గ్రామ యూత్ అధ్యక్షులు జింకల మధు, గంగు భాస్కర్, నరేందర్, వార్డు మెంబర్ మహేందర్‌రెడ్డి, ప్రవీణ్ చారి, పార్టీ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

## సిద్దిపేట పోలీస్ కమీషనర్ శ్వేత

గజ్వేల్, అక్టోబర్ 12, మనం న్యూస్ః బాలికలు, మహిళలకు భారత రాజ్యాంగం ద్వారా కల్పించబడిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిద్దిపేట పోలీస్ కమీషనర్ శ్వేత అన్నారు. గురువారం రోజున ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ విద్యానికేతన్ హై స్కూల్ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, ఫోక్సో వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిపి శ్వేత మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సోషల్ మీడియా వాడే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ , వారి మాటలు నమ్మవద్దన్నారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, మహిళల భద్రతే మా ముఖ్య ఉద్దేశ్యమని, ఇందుకోసం ప్రత్యేకంగా షీ టీమ్ బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థినిలు, యువతులు, మహిళలు ఎప్పుడైనా ఇతరుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నట్లయితే వెంటనే డయల్ 100 లేదా షీ టీమ్ వాట్సాప్ నెంబర్ 8712667343, మహిళా పోలీస్ స్టేషన్ 8712667435 నెంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ ఆర్యక్రమంలో గజ్వేల్ ఏసిపి రమేష్, సిఐ జాన్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ విజయ్‌పాల్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ చిన్నారెడ్డి, అధ్యాపకులు, గజ్వేల్ డివిజన్ షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మీ కోసం నేనున్నా.. ప్రజల కోసమే కాంగ్రెస్

## పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్



అమీన్‌పూర్, అక్టోబర్ 12, మనం న్యూస్ ప్రతినిధిః అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిఓని వందనపురి కానీ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వందనపురి కాలనీ, భరత్ నగర్ కాలనీ, మల్లారెడ్డి కాలనీ, నల్లూరి హైట్స్, ఎస్ఎల్ఎన్ హోమ్స్ కాలనీలలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి వారికి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క కుటుంబం బాగుపడిందని, సామాన్య ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. ఒక్కసారి తమకు అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రెసిడెంట్ శశిధర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి శ్రీనివాస్, కౌన్సిలర్ లావణ్య శశిధర్, జనరల్ సెక్రటరీలు రమేష్ యాదవ్, ఎండి. సలీమ్, మహేష్, నాయకులు ప్రకాష్, మురళి, విజయ్, ఈశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, ప్రవీణ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.







# ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ

సిద్దిపేట రూరల్/అర్బన్, అక్టోబర్ 12, మనం న్యూస్ః తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రమంతా ఆడపడుచులు తొమ్మిది రోజుల పాటు అత్యంత సంబురంగా జరుపుకునే బతుకమ్మ పండుగ విలువలను విద్యార్థులకు తెలుపుతూ బతుకమ్మ ఔన్నత్యాన్ని, సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పంతో జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలు ముందస్తు బతుకమ్మ పండుగను నిర్వహించారు. మెరీడియన్ పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ దంపతులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రాంతి పాఠశాలలో జరిగిన బతుకమ్మ సంబరాలలో జెడ్పి ఛైర్మన్ రోజారాధాకృష్ణశర్మ, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ పాల సాయిరామ్, శ్రీవాణి పాఠశాలలో జెడ్పి ఛైర్మన్ మంజుల రాజనర్సు, కాకతీయ టెక్నో పాఠశాలలో ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గు మల్లారెడ్డి, శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో, గౌతమ్ మోడల్ స్కూల్‌లో బతుకమ్మపండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రకృతిలో లభించే తంగేడు, గునుగు, గడ్డి పువ్వు, రకరకాల పూవులను తెచ్చి బతుకమ్మను అందంగా తీర్చిదిద్ది ఒక దగ్గర చేర్చి బతుకమ్మ పాటలతో ఆడపడుచులందరూ బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటకు బాణీలు కలుపుతూ బతుకమ్మ ఆడారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బతుకమ్మ పాటలు వేసి సంస్కృతి సాంప్రదాయాలను విద్యార్థులకు తెలిసేలా పాఠశాలలు వేడుకలు నిర్వహించాయి. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే బతుకమ్మ పండుగను ఘనంగా పాఠశాలలో నిర్వహించారు. కొన్ని పాఠశాలలు బతుకమ్మ పాటల వెనుక ఉన్న అంతరంగాన్ని
విద్యార్థులకు



అర్థమయ్యేందుకు
బతుకమ్మ పాటలను ఆంగ్లంలోకి అనువదించి ఆడి, పాడి అందరినీ ఆకట్టుకున్నారు. మెరీడియన్ పాఠశాలలో 2022-2023 సంవత్సరానికి 10వ తరగతిలో 10 జిపిఏ సాధించిన 26 మంది విద్యార్థులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే కష్టంతో కాకుండా ఇష్టంతోనే చదవాలన్నారు. తెలంగాణ ప్రజలు ఎక్కడ ఉన్నా వారి సంస్కృతిని కాపాడుకునేందుకు ఈ బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటారని జెడ్పి ఛైర్మన్ రోజారాధాకృష్ణ శర్మ అన్నారు. కులమతాలకు అతీతంగా ఈ పండుగ అదృష్టమని రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ పాల సాయిరామ్ అన్నారు. భవిష్యత్ తరాలకు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను తెలిపేలా ప్రతి పండుగలను పాఠశాలల్లో ఘనంగా నిర్వహించుకుంటామని ట్రస్మా అధ్యక్షులు జగ్గు మల్లారెడ్డి అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో మాత్రమే తొమ్మిది రోజుల పాటు పూవులను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ పండుగ అని మున్సిపల్ ఛైర్మన్ మంజుల అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగకు రాష్ట్ర పండుగగా ప్రత్యేక హోదా కల్పించి ప్రతి సంవత్సరం ఘనంగా జరుగుతుందన్నారు. బతుకమ్మ సంబరాలలో సాంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యార్థులు, ఉపాధ్యాయులు దుస్తులను ధరించి వేడుకల్లో పాల్గొన్నారు.

**-మిరుదొడ్డిలో...** తెలంగాణ సంస్కతి సాంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆరెపలి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మిరుదొడ్డి మండల పరిధిలోని ఆరెపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తీసుకువచ్చిన రకరకాల పూవులతో పాఠశాలలో బతుకమ్మను పేర్చి పండుగ విశిష్టతను తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులతో బతుకమ్మ ఆటలాడుతూ సంతోషాన్ని పంచుకున్నారు.

**-దౌల్తాబాద్‌లో..** మండలపరిధిలోని గాజులపల్లి, లింగరాజుపల్లి, సూరంపల్లి, దొమ్మాట, కోనాపూర్, తిరుమలాపూర్, దౌల్తాబాద్‌తోపాటు పలు గ్రామాల్లోని పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ నర్సవ్వ మాట్లాడుతూ రాష్ట్ర సంస్కృతికి నిదర్శనమైన పండుగ బతుకమ్మ అని, ఆడబిడ్డలకు అతి పెద్ద పండుగ అన్నారు. పాఠశాల దశలోనే విద్యార్థులకు రాష్ట్ర పండుగల గురించి పూర్తి అవగాహన ఉండాలని, సంపూర్ణంగా తెలిసి ఉండాలన్నారు.

**-జగదేవ్‌పూర్...** జగదేవ్‌పూర్ మండల పరిధిలోని చిన్నకిష్టాపూర్ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగ సెలవులు శుక్రవారం నుండి ప్రారంభమవుతున్న సందర్భంగా శుక్రవారం బతుకమ్మ పండుగను సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా విద్యార్థులు, మహిళలతో కలిసి పాఠశాల ఆవరణలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాకీ ప్రభాకర్; ఉపాధ్యాయులు కుకునూరి శేఖర్, అశోక్, సుధారాణి, మహిళలు కవిత, రేణుక, లక్ష్మి సరిత, అనూష తదితరులు పాల్గొన్నారు.

**-గజ్వేల్‌లో....** గజ్వేల్‌లోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ హై స్కూల్‌లో తెలంగాణ పండుగ బతుకమ్మ వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు ధరించి వివిధ రకాల పువ్వులతో బతుకమ్మను పేర్చి గౌరమ్మను చేసి బతుకమ్మ పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాంఎంట్ గోపు ఇన్నారెడ్డి, డైరెక్టర్ థామస్‌రెడ్డి, ప్రిన్సిపల్ విజయపాల్‌రెడ్డి, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

**-పటాన్‌చెరులో...** పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గురువారం బతుకమ్మ సంబరాలు ఘనంగా ౹. కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ డా. నాగరాజు సహకారంతో ప్రిన్సిపల్ దీప దేవానంద్ గౌడ్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్‌రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ మాధవి, జనరల్ సెక్రటరీ అరుంధతిలు ముఖ్య అతిథులుగా హాజరై బతుకమ్మలను ఒక్కచోట చేర్చి ఆటపాటలతో బతుకమ్మ సంబరాలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు, ఉపాధ్యాయులు , మమిళలు బతుకమ్మ ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ సంబురంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు.

**-పాపన్నపేటలో...** మండల పరిధిలోని కుర్తివాడ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల పువ్వులను సేకరించి బతుకమ్మలను తయారు చేశారు. బతుకమ్మ పాటలతో ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు అంజా గౌడ్, నాగభూషణం, శ్యామ్, శివలింగా గౌడ్, శివకుమార్, లోక్యా వెంకటేష్, హాన్నన్, భూలీబాయి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

















# ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ





















